# దివ్యాంగుల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం




హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్‌లో ప్రచారం చేస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్, నాయకులు

- బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి

**హుజూరాబాద్:** దివ్యాంగుల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వెంకటసాయి గార్డెన్‌లో దివ్యాంగుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. దివ్యాంగుల కోసం అన్నివిధాలా ఆలోచిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్ కల్లేపల్లి రమాదేవి, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పావనిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

**ఇంటింటా ప్రచారం**

పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పాలన సాగిందన్నారు.

**నమ్మితే ఆగమే..**

**జమ్మికుంట:** రాష్ట్రంలో కాంగ్రెస్ 50ఏళ్లు పాలించి తెలంగాణ ప్రజలకు చేసిందేం లేదని, బీజేపీ రాష్ట్రంలో గెలిచేది లేదని, ఆ రెండు పార్టీలను నమ్మితే ఆగమైపోతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం గద్రపల్లి, వెంకటేశ్వరపల్లి, కోరపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినీరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అన్న కోసం తమ్ముడి ప్రచారం**

**వీణవంక:** రామక్రిష్ణాపూర్ గ్రామంలో పాడి కౌశిక్‌రెడ్డి తమ్ముడు పాడి ప్రతీక్‌రెడ్డి దంపతులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ మ్యాకల సమ్మిరెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత, ఉప సర్పంచ్ దూడపాక రాజకొంరయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పాడి కౌశిక్‌రెడ్డి గెలువాలని ఘన్ముక్కుల గ్రామ శివాలయంలో బీఆర్ఎస్ నాయకులు 101కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కోడె మొక్కు చెల్లించారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాంతాల రాజిరెడ్డి, సర్పంచ్ జున్నూతుల సునీతమల్లారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడీ సంజీవరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ కట్కూరి మధుసుదన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు గాజుల విజయ్, సీనియర్ నాయకులు ఎడ్ల రాఘవరెడ్డి, గుడిపాటి శివారెడ్డి, భగవాన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజకొంరయ్య, సాగర్ పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి నాది గ్యారంటీ

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ



తిమ్మాపూర్: అభివాదం చేస్తున్న కవ్వంపల్లి

**తిమ్మాపూర్:** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, మానకొండూరు నియోజకవర్గ అభివృద్ధి నాదేనని కాంగ్రెస్ మానకొండూర్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిమ్మాపూర్, మన్నెంపల్లి గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. గ్రామాలకు వచ్చిన కవ్వంపల్లికి పార్టీ శ్రేణులు, మహిళలు డప్పుచప్పుళ్లు, మంగళ హారతులతో స్వాగతం పలికారు. దొరల పాలన పోవాలంటే కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని కోరారు. పదేళ్ల గడీల పాలనను అంతం చేసి ఇందిరమ్మ రాజ్యం తీసుకు రావడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈసారి ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి పట్టం కడుతున్నారని, రోజురోజుకు కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతోందన్నారు. అధికారంలోకి వచ్చాక అమలు చేసే ఆరు గ్యారంటీలను వివరించారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయలేదని తెలిపారు. నిరుద్యోగుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణమని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రాము, పోలు రమేశ్, ఎస్ఎల్‌గౌడ్, నర్సింహారెడ్డి, రంగారావు, గంకిడి లక్ష్మారెడ్డి, సురేందర్‌రావు, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**తంగళ్లపల్లి(సిరిసిల్ల):** కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రెండేళ్లుగా రూ.500కు గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రేపాక, సోమారంపేట, వెంట్రావుపల్లె, గొల్లపల్లి, చింతలకుంటపల్లె, జంగంరెడ్డిపల్లెలో ప్రచారం నిర్వహించారు. ఇల్లంతకుంట ఎంపీపీ వూట్కూరి వెంకటరమణరెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కవ్వంపల్లిని సత్కరిస్తున్న నాయకులు

**శంకరపట్నం:** తాడికల్ సింగిల్‌విండో చైర్మన్ కేతిరి మధుకర్‌రెడ్డి తన అనుచరులతో శనివారం కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సత్యనారాయణ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# నీటి గోస తీర్చాం.. అభివృద్ధి చేశాం



మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్, పక్కన సతీశ్‌కుమార్

- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

**హుస్నాబాద్:** 2014కు ముందు నీటి కోసం ఆడబిడ్డలు అరిగోస పడ్డారని.. తెలంగాణ వచ్చిన తర్వాత మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగు నీరు అందుతుందని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌తో కలిసి హుస్నాబాద్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే వందశాతం దళిత బంధు, బీసీ బంధు, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. 24 గంటల కరెంట్ ఇస్తున్నామని పట్టణంలో లైట్లు, రహదారులు, మురికి కాలువలు నిర్మించుకొని పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దుకున్నామని పేర్కొన్నారు. హుస్నాబాద్ అన్నిరంగాల్లో సమగ్ర అభివృద్ధి చెంది ప్రగతి పథంలో ముందుకెళ్తుందన్నారు. మిడ్‌మానేర్ ద్వారా చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో 23వేల ఎకరాలకు సాగునీటి అందిస్తున్నామని తెలిపారు. దేవాదుల ద్వారా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు 17 వేల ఎకరాలకు, శనిగరం ప్రాజెక్టు ద్వారా 15 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం బీజేపీకి చెందిన 8వ వార్డు కౌన్సిలర్ వేణుయాదవ్ బీఆర్ ఎస్‌లో చేరగా ఆహ్వానించారు.

రాజకీయాల్లో ప్రత్యర్థులను శత్రువులుగా చూడొద్దని, ప్రజాసేవే ముఖ్యమని రాష్ట్ర ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో సీఎంను మార్చాలంటే మతకల్లోలాలు, అలజడులు ఉండేవని, బీఆర్ఎస్ పాలనలో కర్ఫ్యూ, రాజకీయ అలజడి లేదన్నారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు ఒక్క మెడికల్ కళాశాల తీసుకురాలేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు వాల సుప్రజ, గూళ్ల రాజు, పెరుక భాగ్యరెడ్డి, బొల్లి కల్పన, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష తదితరులు ఉన్నారు.

**హుస్నాబాద్‌రూరల్:** కేసీఆర్ పాలనలో దళితులకు సముచిత స్థానం దక్కిందని హన్మకొండ జెడ్పీ చైర్మన్ మారంపెల్లి సుధీర్‌కుమార్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన దళిత ప్రజాప్రతినిధుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ సాయన్న, సర్పంచ్‌లు ప్రవీణ్, మాజీ ఎంపీటీసీలు వెంకటస్వామి, కోతి రాంచంద్రం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**చిగురుమామిడి:** మెట్ట ప్రాంతమైన మండలానికి తాగు, సాగునీటిని అందించిన హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌కు మనమంతా అండగా ఉండి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం లంబాడిపల్లి గ్రామంలో కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఆకవరం భవాని, మహిళా నాయకురాళ్లు గొల్లపల్లి అరుణ, మాజీ ఎంపీటీసీ పెసరి రాధ, మాజీ సర్పంచ్ బందారిపెల్లి కరుణ, గ్రామ శాఖ అధ్యక్షుడు చందబోయిన ఎల్లయ్య, నాయకుడు నాగెల్లి రాజిరెడ్డి, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు బోయిని మనోజ్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు తాటికొండ సందీప్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ బొట్ల రవీందర్, కనగండ్ల అజయ్, రమేశ్, భరత్ పాల్గొన్నారు.

# అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ

- కాంగ్రెస్ చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం



దేశరాజ్‌పల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న మేడిపల్లి సత్యం

**రామడుగు:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. దేశరాజ్‌పల్లి, మోతె, రుద్రారం, రంగసాయిపల్లి, లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి, గుండి, రాంచంద్రాపూర్, చిప్పకుర్తి, శ్రీరాములపల్లి, తిర్మలాపూర్, రామడుగు, కొక్కెరకుంట, వన్నారం గ్రామాల్లో శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత లాంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని వివరించారు. ఒక్కసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా నిలిచారని ఆరోపించారు. మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పుల అంజనీప్రసాద్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, నాయకులు కోల రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ**

**చొప్పదండి:** కాట్నపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ కట్టెకోల తార, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కట్టెకోల లక్ష్మణ్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు భక్తు కుమార్, బండారి స్వామి శనివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారి వెంట మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పురం రాజేశం, మునిగాల చందు తదితరులున్నారు.

**బోయినపల్లి:** మండలంలోని దేశాయిపల్లి, తడగొండ, మల్కాపూర్ తదితర గ్రామాల్లో చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యంకు మద్దతుగా శనివారం కాంగ్రెస్ మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై వివరించారు. ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, బోయిని ఎల్లేశ్, నిమ్మ వినోద్‌రెడ్డి, భరత్‌రెడ్డి, పెండ్యాల శ్రీనివాస రెడ్డి, నిమ్మ వెంకటరమణారెడ్డి శ్రీధర్, భాస్కర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ. నజీర్ తదితరులు పాల్గొన్నారు.



మేడిపల్లి సత్యంతో ఎంపీటీసీ తార

# యువతను విస్మరించిన బీఆర్ఎస్

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రణవ్

**జమ్మికుంట:** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యువతకు చేసిందేం లేదని, నోటిఫికేషన్ రద్దులు, పేపర్ లీకులు చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితెల ప్రణవ్ ఎద్దేవా చేశారు. శనివారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం, పాత మార్కెట్, సువర్ణ ఫంక్షన్ ఏరియాలు, కృష్ణకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు దాసరి భూమయ్య, పొనగంటి మల్లయ్య, తుమ్మేటి సమ్మిరెడ్డి, అరుకాల వీరేశలింగం, ముక్కెర రాజు, మొలుగూరి సదయ్య, కసుబోజుల వెంకన్న, ఎగ్గని శ్రీనివాస్, సలీం, ఎర్రం సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కమలాపూర్:** నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి వొడితల ప్రణవ్ కోరారు. కమలాపూర్, గూడూరు, రాములపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. హుజూరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి నాగ మధు, రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య, మండల అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్, నాయకులు బాలసాని రమేశ్‌గౌడ్, తవుటం రవీందర్, దేశిని ఐలయ్యగౌడ్, కొండ రమేశ్, అశోక్, హనుమాన్‌ప్రసాద్, వంశీధర్ రావు, కొండపాక మనీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: మాట్లాడుతున్న ఒడితెల ప్రణవ్

**ఇల్లందకుంట:** గడ్డివానిపల్లె గ్రామంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. రైతులు, రైతు కూలీలకు ఆరు గ్యారంటీలను వివరించారు. వొడితల ప్రణవ్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చింతల ఐలయ్య, గొర్ల సునీల్, సల్పాల సాయిలు, గడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘గండిపల్లి’ని ఎందుకు పూర్తి చేయలే..?

- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్



గండిపల్లిలో పొన్నంకు స్వాగతం పలుకుతున్న మహిళలు

**అక్కన్నపేట(హుస్నాబాద్):** అధికారంలో ఉండి పదేళ్లు గడిచినా గండిపల్లి ప్రాజెక్టులో తట్టెడు మట్టి కూడా తీయలేదని, ఈ అసమర్థ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను ఓటు ద్వారా ఇంటికి సాగనంపాలని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని ధర్మారం, తుర్కవానికుంట, పోతారం(జే), గండిపల్లి, పంచరాయితండా, కుందనవానిపల్లి, మైసమ్మవాగు తండాతో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో వస్తే 3 గంటల కరెంట్ అంటూ బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ అని, అధికారంలో రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతామన్నారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అయిలయ్య, సృజన్‌కుమార్, తిరుపతినాయక్, జనార్దన్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

**పొన్నం సతీమణి ప్రచారం**

**కోహెడరూరల్(హుస్నాబాద్):** మండలంలోని సముద్రాలలో పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బస్వరాజు శంకర్, మాజీ సర్పంచ్ దొమ్మాట జగన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, శంకర్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలు చేస్తే కేసు పెట్టారు

- నా అనుచరులను భయపెడుతున్నారు
- ట్యూరిటో, యప్‌టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉదయానందన్‌రెడ్డి

**వీణవంక:** పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ చేద్దామనుకుంటే అడ్డుకొని కేసు పెట్టారని, సేవా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని, నా అనుచరులను సైతం భయభ్రాంతులకు గురి చేస్తూ కేసుల్లో ఇరికించారని వీణవంక గ్రామానికి చెందిన ట్యూరిటో, యప్‌టీవీ సీఈవో పాడి ఉదయానందన్ రెడ్డి వాపోయారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆధునిక గ్రామ దర్శిని ద్వారా యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని, మహిళలకు ఉద్యోగాలు ఇస్తూ ఉపాధి కల్పిస్తున్నాని పేర్కొన్నారు. ఇప్పటివరకు వీణవంక మండలంలో 70మందికి పైగా ఉపాధి కల్పిస్తే ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి వాళ్ల ఇళ్లలోకి వెళ్లి బెదిరిస్తున్నాడని ఆరోపించారు. మా కుటుంబానికి అన్ని పార్టీలతో సంబంధాలున్నాయని, తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం కొట్లాడిన వ్యక్తినని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన చూసి హుజూరాబాద్‌లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్‌కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఈటల రాజేందర్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసారపు ప్రభాకర్, మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మడుగూరి సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇందిరాదేవి

**హుజూరాబాద్‌రూరల్:** విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిల్లల కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం చేయాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బట్టీ విధానానికి స్వస్తి పలికి సృజనాత్మకత విద్య వైపు అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహమూర్తి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.పి.దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాసా కిట్స్ పంపిణీ



విద్యార్థులకు నాసా కిట్స్ అందించిన ప్రిన్సిపాల్

**తిమ్మాపూర్:** మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు శనివారం నాసా కిట్స్ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ప్రాజెక్టు నాసా ప్రాముఖ్యాన్ని వివరించారు. విద్యార్థులు ప్రణాళికతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. శ్రీచైతన్య కళాశాల డీన్ జగన్మోహన్, ప్రిన్సిపాల్ రాధాకష్ణ, ఏజీఎం రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ విజయకష్ణ, విజయలక్ష్మి, నూరి, మమత, కృష్ణవేణి, ఏవో జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీజేపీకి రాజీనామా

**జమ్మికుంట:** బీజేపీ జమ్మికుంట పట్టణ మైనార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ రంజాన్ రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. బీజేపీలో 13 సంవత్సరాల నుంచి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి క్రమశిక్షణగా పని చేసినా ఆదరణకు నోచుకోలేదన్నారు. చిన్నచూపు చూడడం, గ్రూపు రాజకీయాలు చేయడంతో పాటు ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గజ్వేల్‌లో పోటీ చేస్తున్నాడని, నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడంతో పార్టీలో గందరగోళ పరిస్థితి నెలకొందని అన్నారు. కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ తెలియజేస్తానని తెలిపారు.

## ఓటు హక్కుపై అవగాహన

**సైదాపూర్:** వెన్నంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ తీశారు. అంబేద్కర్ కూడలిలో ఈవీఎంలో ఓటు ఏవిధంగా వేయాలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఓటేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్, జైగోపాల్‌సింగ్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, శారదాదేవి, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

## పాఠశాలలో మాక్ పోలింగ్

**తిమ్మాపూర్:** నేదునూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల లీడర్‌ను ఎన్నుకునేందుకు పదోతరగతి విద్యార్థిని భూమికను రిటర్నింగ్ అధికారిగా నియమించారు. ప్రిసైడింగ్ అధికారిగా రుతిక, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారిగా శ్వేత, ఓపీవోగా అక్షిత, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా పూజితను నియమించారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికను నిర్వహించారు. ఆరుగురు విద్యార్థులు స్కూల్ లీడర్ కోసం పోటీ చేశారు. ఇందులో పదోతరగతి విద్యార్థి మద్దూరి శ్రీచరణ్ స్కూల్ లీడర్‌గా ఎన్నికయ్యాడు. ఎన్నికల నిర్వహణను హెచ్ఎం సీహెచ్ లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు సంఘవి, పద్మన, అనిల్, ఫలిమా, అమల పర్యవేక్షించారు.